TGTEL/26/A4985

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లతో మహిళల ఆర్థిక సాధికారతకు బలం





**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి :** ఆల్వాల్ మున్సిపల్ పరిధిలోని కానాజిగూడ మెయిన్ రోడ్డులో శ్రీ దుర్గా మహిళా పొదుపు సంఘానికి మంజూరైన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఇటువంటి క్యాంటీన్లు దోహదపడతాయని అన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాంటీన్‌లో టీ, మిర్చి బజ్జి, పునుగులు, సమోసా, వడ, చపాతీ తదితర అల్పాహార పదార్థాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్, ఆల్వాల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రవీణ్, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# రూపాయి ఫౌండేషన్ సామూహిక వివాహాల పోస్టర్ ఆవిష్కరణ



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 18న నిర్వహించనున్న వికలాంగులు, నిరుపేదల సామూహిక వివాహ మహోత్సవాల పోస్టర్‌ను రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వికలాంగులు, పేద కుటుంబాలకు రూపాయి ఫౌండేషన్ అందిస్తున్న సహాయం అభినందనీయమని అన్నారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 50 వికలాంగులు, నిరుపేద జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించి అవసరమైన సామగ్రిని అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# యువకుడు అదృశ్యం..

## ఆచూకీ తెలిపాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

**ఆదాబ్ సైబరాబాద్, జవహర్ నగర్ :** ముత్తుస్వామి కాలనీ, బాలాజీనగర్‌కు చెందిన డేనియల్ (21) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్న డేనియల్ జూలై 31 మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్విచ్ ఆఫ్ వస్తోందని పేర్కొన్నారు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డేనియల్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



# ఆ అనాథలకు దేవుడిచ్చిన కొడుకు!

నేటి యువతరం కెరీర్, ఎంజాయ్‌మెంట్ అంటూ పరుగులు పెడుతుంటే ఈ 27 ఏండ్ల యువకుడు మాత్రం సమాజం కోసం, అనాథల కోసం తన జీవితాన్ని అంకితం చేశాడు. కడుపున పుట్టినవాళ్లు కాదనుకున్న అభాగ్యులకు దేవుడిచ్చిన కొడుకు అనిపించుకుంటున్నాడు. 11 ఏండ్లుగా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ, ఎవరూ లేనివారికి ఆఖరి మజిలీలో తోడుగా నిలుస్తున్నాడు దనాల ఆర్యవంశీ. 'మనకోసం మనం బతకడం జీవితం కాదు..

**ఆ అనాథలకు దేవుడిచ్చిన కొడుకు!**

నేటి యువతరం కెరీర్, ఎంజాయ్‌మెంట్ అంటూ పరుగులు పెడుతుంటే ఈ 27 ఏండ్ల యువకుడు మాత్రం సమాజం కోసం, అనాథల



కోసం తన జీవితాన్ని అంకితం చేశాడు. కడుపున పుట్టినవాళ్లు కాదనుకున్న అభాగ్యులకు దేవుడిచ్చిన కొడుకు అనిపించుకుంటున్నాడు. 11 ఏండ్లుగా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ, ఎవరూ లేనివారికి ఆఖరి మజిలీలో తోడుగా నిలుస్తున్నాడు దనాల ఆర్యవంశీ. 'మనకోసం మనం బతకడం జీవితం కాదు.. నలుగురి కోసం బతకడమే నిజమైన జీవితం' అంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూనే మరోవైపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ యువకుడు బతుకమ్మతో ముచ్చటించాడు.

**ఆ విశేషాలు తన మాటల్లోనే...**

మాది సికింద్రాబాద్‌లోని ఓల్డ్ బోయిన్‌పల్లి. ఇంటర్మీడియట్ దాకా చదువుకున్న. చిన్నప్పటినుంచే సామాజిక సేవపై ఆసక్తి ఎక్కువ. ఇంటర్‌లో ఉన్నప్పుడు నా ఫ్రెండ్ వాళ్ల మేనకోడలు తలసేమియాతో బాధపడుతుండేది. ఆమెకు రక్తం ఎక్కించడం కోసం చాలామందిని అడిగాం. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ పాప చనిపోయింది. ఆమె మరణం నన్ను ఎంతగానో కలిచివేసింది. అలాంటి పరిస్థితి మరెవరికీ ఎదురవ్వకూడదని 2015లో రక్తదాతల గ్రూప్ క్రియేట్ చేశాను. అత్యవసర సమయాల్లో స్పందించి రక్తదానం చేసే వారి వివరాలు కనుక్కొని మరీ అందులో యాడ్ చేశాను. రక్తం కావాలని ఎవరు అడిగినా వెంటనే స్పందించి, సంబంధిత డోనర్‌ను పంపించేవాణ్ని. ఈ సేవను తెలంగాణతోపాటు ఏపీ, తమిళనాడులోనూ కొనసాగిస్తున్నాం. ఇప్పటివరకు 5000 మందికి పైగా బాధితులకు బ్లడ్ డొనేట్ చేశాం. వ్యక్తిగతంగా రక్తదానం చేసే అదృష్టం మాత్రం నాకు దక్కలేదు. నేను ఎప్పుడు రక్తదానం చేయడానికి వెళ్లినా.. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉందని, బలహీనంగా ఉన్నానని వైద్యులు చెప్పేవారు. దాంతో నిరాశతో వెనుదిరిగేవాణ్ని.

**400కు పైగా అంత్యక్రియలు చేశా**

ఒకసారి నాకు తెలిసిన వ్యక్తి మరణించాడు. ఎప్పుడు కలిసినా ఆత్మీయంగా మాట్లాడే ఆయన రోడ్డుపక్కన దిక్కులేని శవంగా పడి ఉన్నాడు. ఆయనకంటూ ఎవరూ లేరు. అందుకే, ఆ పెద్దాయనకు అంతిమ సంస్కారం నేనే నిర్వహించాను. ఆ తర్వాత కార్ఖానా దగ్గర ఓ వృద్ధురాలు మరణించింది. ఆమెకు కూడా తలకొరివి నేనే పెట్టాను. అప్పుడు నా వయసు 17 ఏండ్లు. వాళ్లిద్దరి అంత్యక్రియలు చేసినప్పుడు భయం కన్నా.. ఎక్కువగా బాధేసింది. కడుపున పుట్టిన వాళ్లు కాదనుకున్న ఎందరో అభాగ్యులు ఈ మహా నగరంలో అనాథలుగా కాలం చేస్తున్నారు. వారికి గౌరవంగా సాగనంపడం దేవుడు నాకు ఇచ్చిన అదృష్టంగా భావించాను. అందుకే వివిధ పోలీస్ స్టేషన్లలో నా ఫోన్ నెంబర్ ఇచ్చి, అనాథ శవాలకు ఉచితంగా అంత్యక్రియలు చేస్తానని చెప్పాను.అలా హైదరాబాద్ పరిధిలో 400కు పైగా అంత్యక్రియలు నిర్వహించాను. మృతుల ధర్మానుసారం ఈ చివరి గౌరవం సమర్పిస్తున్నాను. నా సేవా కార్యక్రమాలు తెలుసుకున్న ఓ పెద్దాయన ఫోన్ చేసి..'నాకు సొంత ఇల్లు, కావాల్సినంత ఆస్తి ఉంది. అయినా నా పిల్లలు పట్టించుకోవడం లేదు. వృద్ధాశ్రమంలో ఉన్నాను. ఎవరో తెలియని వారికి అంత్యక్రియలు చేస్తున్నావు. నా అంత్యక్రియలు కూడా నువ్వే చేయాలి బాబు' అంటూ చాలా భావోద్వేగానికి గురయ్యాడు.

# 18 ఏళ్లుగా పూర్తి కాని ఆర్‌వోబీ నిర్మాణం పూర్తి చేయాలి: బీజేపీ




**ఆదాబ్ సైబరాబాద్, ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్‌లో 18 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టారు. మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ సూచనల మేరకు, ఘట్‌కేసర్ మున్సిపల్ అధ్యక్షుడు కుమ్మిడి మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, ఆర్‌వోబీ నిర్మాణం ఆలస్యం వల్ల ప్రజలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాల భయంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హామీలు కాకుండా వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌వోబీ పూర్తయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్ రెడ్డి, కాకుంట్ల చంద్రారెడ్డి, పట్లోళ్ల విక్రం రెడ్డి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# కేశవ! నారాయణ! మాధవ!

భారత దేశంలో, ఒకానొక గ్రామంలో, చాలా రోజుల క్రితం గోవిందరాజు అనబడే ఒక వ్యాపారస్తుడు ఉండేవాడు. అతనికి చిన్నప్పుడు ఎప్పుడో ఎదో గుడిలో ప్రవచనలో, "మరణించేటప్పుడు ఆఖరి శ్వాసతో దేవుడిని తలుచుకున్న వారికి స్వర్గం ప్రాప్తం అవుతుంది" అని విన్న మాట మనసులో నిలిచిపోయింది. కాల క్రమేణా అతనికి ముగ్గురు కొడుకులు పుట్టారు. ఆ ముగ్గురి కొడుకులకి కేశవ, నారాయణ, మాధవ అని పేర్లు పెటుకున్నాడు. కొడుకులందరికి దేవుడి పేర్లు పెట్టుకుంటే మరణించేటప్పుడు వాళ్ళని పిలిచినా దేవుళ్ళని తలుచు కున్నట్లుంటుంది అని అనుకున్నాడు. "ఎలాగా మరణించేటప్పుడు దేవుడిని తలుచు




కుంటాను కదా, రోజు పుణ్యం సంపాదించడానికి ఆరాట పడక్కర్లేదు" అని గోవిందరాజు అనుకునేవాడు. వ్యాపారంలో మోసాలు చేయటం మొదలు పెట్టాడు. బాగా డబ్బు సంపాదించిన ఎప్పుడు దాన ధర్మాలు చేయలేదు. గుడి, గోపురం, పూజ, పునస్కారం ఇలాంటి వాటికి దూరంగా ఉండేవాడు. ఇంట్లో వాళ్ళు ఏమైనా అంటే వెంటనే పెడసరిగా జవాబు చెప్పే వాడు. అతని భార్య మట్టుకు చాలా మంచిది. అందరితో మంచిగా ప్రవర్తించి, మంచి పనులు చేస్తూ అందరిలో మంచి పేరు తెచ్చుకుంది. ఇలా రోజులు గడిచాయి. అమ్మ ప్రభావం వల్ల ముగురు కొడుకులు సద్బుద్ధితో పెద్ద వాళ్ళయ్యారు. వ్యాపారంలో గోవిందరాజు కి సహాయం చేయడం మొదలు పెట్టారు. గోవిందరాజు కూడా వృద్ధుడు అయ్యాడు. వయసుతో పాటు జబ్బులు కూడా వచ్చాయి. మంచాన్న పడ్డాడు. ఇక గోవిందరాజుకి ఆఖరి సమయం వచ్చింది. వైద్యుడుని ఇంట్లోనే వుండి, సమయం వచ్చినప్పుడు చెప్పమన్నాడు. ఇప్పుడు కూడా మరణించేటప్పుడు దేవుడిని తలచుకుంటే చాలు, అన్ని పాపాలు కడిగి పోయి స్వర్గం ప్రాప్తం అవుతుందని గట్టి నమ్మకంతో వున్నాడు, గోవిందరాజు. సమయం వచ్చింది. వైద్యుడు గోవిందరాజుకు చెప్పాడు. వెంటనే గోవిందరాజు "కేశవ! నారాయణ! మాధవ!" అన్నాడు. చావు బ్రతుకుల మధ్య ఉన్న తండ్రి పిలుస్తున్నాడు అనుకుని ముగ్గురు కొడుకులు పరిగెత్తుకుంటూ అతని మంచం దేగ్గిరకి వచ్చారు. ముగ్గురు కొడుకులని చూసి వెంటనే గోవిందరాజు తన ఆఖరి శ్వాసతో, "మీరు ముగ్గురూ ఇక్కడే వుంటే వ్యాపారం ఎవరు చూసుకుంటున్నారు? ఏ మాత్రం శ్రద్ధ లేదు" అని తిడుతూ కన్ను మూసాడు. అలాగా చివరి మాట దేవుడి పేరు కాక పోవడంతో, జీవితాంతం చేసుకున్న పాపాల కారణంగా అతనికి స్వర్గం చెందలేదు.

# ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం



ఒక నాడు ఓ కోతి అడవిలో గెంతుతూ వుంటే దాని కాలికి ఒక ముల్లు గుచ్చుకుంది. అది వూళ్ళోకొచ్చి ఒక మంగలిని ఆశ్రయించింది. మంగళి చక్కగా ముల్లు తీసి విసిరేశాడు. తిరిగి చూసేసరికి కోతి తన కత్తి తీసుకుని పారిపోవడం గమనించాడు.

"ఓ కోతి! ఓ కోతి! నా కత్తి!" అన్నాడు. కోతి వెనక్కి తిరిగి, "ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం", అని వెక్కిరించి పారిపోయింది. కత్తి తీసుకుని కోతి ఊళ్ళో తిరగడం మొదలుపెట్టింది. ఒక వ్యక్తిని చేతితో కొబ్బరి మట్టలు కొట్టడం చూసింది. జాలిపడి అతని చేతికి కత్తి అందించింది.

ఆ మనిషి సంతోశంగా మట్టెలు కత్తితో కొడుతుంటే, పక్కన పడేసిన మట్టెలను కోతి తీసుకుని ఉడాయించింది.

"ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం! కత్తి పోయి మట్టలు వచ్చే ఢాం ఢాం ఢాం!" అని పాడుకుంటూ తన దారిని వెళ్ళిపోయింది కోతి.

దారిన ఒక బెల్లం కాచే ఆసామి నేల మీద బెల్లం అచ్చులు వేయడం చూసి, ఆ మట్టలు అతనికి ఇచ్చింది. ఆసామి మట్టలు పరుచుకుని బెల్లం అచ్చులు వాటిమీద పెట్టడం మొదలు పెట్టాడు.

అలవటు ప్రకారం కోతి బెల్లం అచ్చులు తీసుకుని, వెక్కిరిస్తూ పారిపోయింది.

"ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం! కత్తి పోయి మట్టలు వచ్చే ఢాం ఢాం ఢాం! మట్టలు పోయి అచ్చులు వచ్చే ఢాం ఢాం ఢాం!"

"న బెల్లం అచ్చులు! దొంగ కోతి!" అని లబోదిబోమంటూ ఆసామి చూస్తూ వుండిపోయాడు. కొంచం దూరానికి ఒక పేదరాశి పెద్దమ్మ బెల్లం లేని చప్పిడి బూరెలు చేస్తూ కనిపించింది.

కోతి ఆమెకు బెల్లం అచ్చులు ఇచ్చింది. పెద్దమ్మ బెల్లం బూరెలు చేయడం మొదలెట్టింది. అవి చేయంగానే కోతి వండి పెట్టిన బూరెలు తీసుకుని పరిగెట్టింది.

"ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం!
కత్తి పోయి మట్టలు వచ్చే ఢాం ఢాం ఢాం!
మట్టలు పోయి అచ్చులు వచ్చే ఢాం ఢాం ఢాం!
అచ్చులు పోయి బూరెలు వచ్చే ఢాం ఢాం ఢాం!"

కొంత సేపటికి కోతికి గోవుల కాపర్లు ఇద్దరు యెదురయ్యారు. వాళ్ళకి బూరెలు ఇచ్చింది. వాళ్ళు ఇష్టంగా బూరెలు తింటూ మయిమరిచిపోయారు. కోతి గోవును తోలుకుని వెళ్ళిపోయింది. 'కోతి! కోతి! మా గోవును ఇచ్చేయి!" అని చాలా దూరం కాపర్లు తరిమేరు. కాని కోతి వాళ్ళకు చిక్కలేదు.

'ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం!
కత్తి పోయి మట్టలు వచ్చే ఢాం ఢాం ఢాం!
మట్టలు పోయి అచ్చులు వచ్చే ఢాం ఢాం ఢాం!
అచ్చులు పోయి బూరెలు వచ్చే ఢాం ఢాం ఢాం!
బూరెలు పోయి గోవు వచ్చే ఢాం ఢాం ఢాం!"

రోజంతా పడ్డ శ్రమకి కోతి బాగా అలిసిపోయింది."అబ్బ! చాలా కష్ట పడ్డాను ఇవాళ, వొళ్ళంతా పులిసిపోయింది. వెణ్ణీళ్ళు కాచు, స్నానం చేసి విశ్రామిస్తాను," అని గోవును ఆజ్ఞపించింది.

గోవుకి బాగా కోపమొచ్చింది. సలసలా మరిగించిన నీళ్ళను తీసుకొచ్చి కోతి వంటిమీద భళ్ళున పోసేసింది. కోతి కుయ్యో మర్రో మని ఏడుస్తుంటే; తోలు వూడిన కోతిని చూసి నవ్వుకుంటూ ఆవు తన మందలోకి వెళ్ళిపోయింది.

# మాధవ ముంగిస

ఉజ్జైని నగరంలో మాధవా అనబడే బ్రాహ్మడుండేవాడు. ఒక రోజు ఆ బ్రాహ్మడి భార్య పక్కవూరికి పేరెంటానికి వెళ్తూ వాళ్ళ పసి పాపను ఆ బ్రాహ్మడికి అప్పచెప్పి వెళ్ళింది. ఇదిలా ఉండగా ఆ రోజు మహారాజుగారు ఆ బ్రాహ్మడిని సభకు రమ్మని కబురు పెట్టారు. పసిపాపను ఇంట్లో వదిలేసి ఎలా వెళ్ళడమని ఆలోచిస్తున్న బ్రాహ్మడికి అతని ముంగిస కనిపించింది. "ఈ ముంగిస చాలా యేళ్ళగా నా దెగ్గిర నా కొడుకులానే పెరుగుతోంది, దీనికి పాపను అప్పచెప్పి వెళ్తాను" అనుకుని రజ్యసభ వైపు బయలుద్యారాడు. ముంగిస తనను నమ్మి ఈ పనిని అప్పచెప్పినందుకు చాలా గర్వ పడింది. వెళ్ళి పాప దెగ్గిరే కూర్చింది. సమయానికి ఒక పాము పాప వైపుకు వెళ్తూ చూసింది. వెంటనే ఆ పామును చంపేసింది. కొంత సేపటికి మాధవ రజ్యమర్యాదలన్ని స్వీకరించి, రాజు ఇచ్చిన బహుమానాలతో సంతోషంగా ఇంటికి తిరిగి వచ్చాడు. అతన్ని చూడగానే ఆనందంతో ముంగిస అతని దెగ్గిరకు గబగబా వెళ్ళింది. మాధవ ముంగిస మూతికున్న నెత్తురును చూసాడు. పాపను చంపేసిందని అపోహ పడ్డాడు. కోపంగా ఆ ముంగిసను చంపేసాడు. బాధతో ఇంటిలోకెళ్ళాడు. ఎదురుగానే పసి పాప తన ఉయ్యాలలో హాయిగా నిద్రపోతోంది. పక్కనే చచ్చి పడున్న పామును చూసి మాధవ అన్ని అర్థం చేసుకున్నాడు.

# ఖమ్మం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే పెద్దపీట

- **ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ప్రారంభానికి ముందు బీజేవైఎం రాష్ట్ర నాయకులు నల్లమాస శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, గడ్కరీ చిత్రపటాలకు పాలాభిషేకం.**

**నెల్లూరి కోటేశ్వరరావు**




**ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం :** ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి త్వరలో ప్రారంభం కానున్న సందర్భంగా భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రాష్ట్ర నాయకుడు నల్లమాస శ్రీనివాస్ ఆధ్వర్యంలో తల్లంపాడు గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సుమారు రూ.4 వేల కోట్ల వ్యయంతో నిర్మితమైన ఖమ్మం––దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి జిల్లాకు అభివృద్ధి దిశగా కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ జాతీయ రహదారి ద్వారా పరిశ్రమల స్థాపనకు అవకాశాలు పెరగడంతో పాటు రవాణా వ్యవస్థ మరింత వేగవంతమవుతుందని, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు త్వరగా మార్కెట్లకు చేరుకోవడంతో వారికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అలాగే భూముల విలువలు పెరగడంతో పాటు జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీలకు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు నకిరికంటి వీరభద్రం, నున్నా రవికుమార్, విజయ్‌రాజ్, రవి రాథోడ్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు జాటోత్ మధు, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు సత్తి నాగరాజు, నేలకొండపల్లి అధ్యక్షుడు పగర్తి సుధాకర్, కోటమర్తి సుదర్శన్, శాసనాల సాయిరాం, గడ్డం వెంకటేశ్వర్లు, ఉపేందర్ రెడ్డి, రేఖ సత్యనారాయణ, మందా సరస్వతి, రీగన్ ప్రతాప్, రామకృష్ణ, జంగిల్ రమణ, మనీ నరేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

